పోరాటాలకు సిద్ధం కావాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. నగరంలోని ఓ వేడుకల మందిరంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మాదిగలను మోసం చేసిన వారు భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వర్గీకరణ కోసం చేసిన పోరాటంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని అందరిని నమ్మించారన్నారు. త్వరలో వర్గీకరణ అమలుకు చేపట్టే కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. ఉద్యమాలకు మాదిగ, మాదిగ ఉపకులాలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు 30 ఏళ్ల పాటు పోరాటం చేసిన చరిత్ర మందకృష్ణ మాదిగకే దక్కిందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్, నాయకులు గంగారాం, సురేష్, మారుతి, రమేష్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

జిల్లాకు 8 మంది మండల వ్యవసాయాధికారులు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో 8 మండలాలకు కొత్తగా వ్యవసాయాధికారులను (ఎంఏవో) నియమిస్తున్నట్లు వ్యవసాయ కమిషనరేట్ నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సాలూరకు కె.శ్వేత, పోతంగల్‌కు బి.నిశిత, వర్నికి ఎం.రాజశేఖర్, రుద్రూర్‌కు గంగోని సాయికృష్ణ, కోటగిరికి టి.రాజు, ఏర్గట్లకు ఎస్.వైష్ణవ్, మెండోరాకు వై.వసంత్, డొంకేశ్వర్‌కు బార్ల మధుసూదన్‌లకు పోస్టింగులు ఇచ్చారు.



ఎస్కేప్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ఎస్సారెస్పీకి 11,454 క్యూసెక్కుల వరద

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీ ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని బుధవారం ఉదయం విడుదల చేసినట్లు ఈఈ చక్రపాణి, ఏఈఈ కొత్త రవి తెలిపారు. ప్రస్తుతం 1091 అడుగుల(80.501 టీఎంసీలు) వరకు నీరుందన్నారు. ఎగువ నుంచి 11,454 క్యూసెక్కుల చేరుతోందన్నారు. వరద కాల్వ ద్వారా నీటి విడుదలను సాయంత్రం నుంచి నిలిపివేశామన్నారు. కాకతీయ కాల్వకు 5800, లక్ష్మి కాల్వకు 150, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

అటవీ భూములు అన్యాక్రాంతం కావొద్దు

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జిల్లాలో అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సీసీఎఫ్ శరవణన్ సూచించారు. వర్నిరోడ్‌లోని జిల్లా అటవీ శాఖ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. నగర వన్ యోజనలో భాగంగా మంజూరైన పార్కు, నిధుల వినియోగంపై చర్చించారు. పార్కుల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. వచ్చే ఏడాది హరితహారం లక్ష్యం, నర్సరీల్లోని మొక్కల వివరాలు తెలుసుకున్నారు. సారంగపూర్ నేచర్ పార్కును పరిశీలించారు. డీఎఫ్‌వో వికాస్‌మీనా, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానీశంకర్, ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశమైన అటవీ అధికారులు

తొలి పాఠం.. మధుర సంతకం

కొత్త ఉపాధ్యాయుల మనోగతం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం



వారంతా ఉపాధ్యాయ వృత్తిని ప్రేమించారు. ఏళ్ల తరబడి ఉద్యోగం కోసం నిరీక్షించారు. 2018 తర్వాత డీఎస్సీ నిర్వహించడంతో కష్టపడి చదివారు. కొందరు గతంలో త్రుటిలో ఉద్యోగం చేజార్చుకోగా.. మరికొందరు వచ్చిన అవకాశం వదులుకోవద్దని కఠోర సాధన చేశారు. ఫలితాల వెల్లడి మొదలుకొని ధ్రువపత్రాల పరిశీలన, ఉద్యోగ నియామకపత్రాల వరకు ఉత్కంఠగా గడిపారు. తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం చేరి హాజరు పట్టికలో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా తొలిరోజు అనుభవాలు 'ఈనాడు'తో పంచుకున్నారు. ఇన్నాళ్లు పడిన కష్టం బడి ఆవరణలో అడుగిడగానే పోయిందని, తల్లిదండ్రులు, గురువులు, కుటుంబ సభ్యుల వల్లే ఈ స్థాయికి వచ్చామన్నారు. ఇకపై భావితరాల భవిష్యత్తు తీర్చిదిద్దే గురుతర బాధ్యత తమపై ఉందని చెబుతున్నారు.

★ పేరు ☛ ఊరు/మండలం ➻ పాఠశాల ■ పోస్టు కేటగిరీ

● మొదటి రోజు పాఠం/తరగతి ✤ అనుభూతి



విద్యార్థులకు యాదగిరిగుట్ట గురించి వివరిస్తున్న సంతోష్

నాన్న మమ్మల్ని వదిలేసినా..

★ సీహెచ్ సంతోష్ ☛ ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్
➻ కోటగల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నిజామాబాద్
■ ఎస్జీటీ ● యాదగిరిగుట్ట, ఐదో తరగతి
✤ ఇంటర్మీడియట్ తర్వాత డీఎడ్ పరీక్ష రాస్తే రాష్ట్రస్థాయి ర్యాంకు వచ్చింది. నాలో ఆత్మవిశ్వాసం పెంచింది. ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎడ్ చేశాను. ఇంటర్‌లో ఉన్నప్పుడే నాన్న మమ్మల్ని వదిలేసి వెళ్లిపోవడంతో అమ్మ విజయ బీడీలు చుడుతూ చదివించారు. డీఎడ్ శిక్షణలో భాగంగా ఇదే పాఠశాలలో టీచింగ్ ప్రాక్టీస్ చేశాను. అదే బడిలో ఇప్పుడు కొలువు రావడం ఆనందంగా ఉంది.

నాన్న ప్రోత్సాహంతో..



★ వి.నందిని ☛ మెండోరా ➻ కోటగల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నిజామాబాద్ ■ ఎస్జీటీ ● ఊరి నుంచి వచ్చి రిపోర్ట్ చేసే సరికి పాఠశాల సమయం పూర్తయింది. ✤ నాన్న సలహాతో 2013-15లో డీఎడ్ చేశా. 2018లో డీఎస్సీ రాసినా 5 మార్కులతో ఉద్యోగానికి దూరమయ్యా. కుంగిపోతే నాన్న ప్రోత్సహించారు. తర్వాత డిగ్రీ, బీఎడ్ పూర్తి చేసి ఉద్యోగం సాధించాను. మొదటి పోస్టింగ్ జిల్లా కేంద్రంలో రావడం తొలి రోజే వెళ్లి హాజరుపట్టికలో సంతకం చేశా.

సోదరుడు లేకుంటే నేను లేను



★ బదావత్ రాజేశ్ ☛ ఎత్తుతండా, ఇందల్‌వాయి మండలం ➻ న్యావనంది ప్రాథమిక పాఠశాల, సిరికొండ ■ ఎస్జీటీ ● విద్యార్థులను పరిచయం చేసుకున్నాను ✤ నా కల సాకారం కావడానికి నా సోదరుడు సంతోష్ కారణం. ప్రైవేటులో ఉద్యోగం చేస్తూ నాకు అండగా నిలిచాడు. అధ్యాపకుడు వేణుగోపాల్‌రెడ్డి సలహాతో 2018-20లో డీఎడ్ పూర్తిచేసి, హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని తొలి ప్రయత్నంలో ఉద్యోగం సంపాదించా. కుటుంబంలో పట్టరాని సంతోషం ఉంది. ప్రభుత్వ పాఠశాలలో అడుగుపెట్టడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి.

బాధ్యత పెరిగింది



★ పి.భూమయ్య
☛ యాదగిర్‌పూర్, కోటగిరి
➻ కోనసముందర్, కమ్మర్‌పల్లి
■ స్కూల్ అసిస్టెంట్, హిందీ
● హిందీ భాష పరిచయం
✤ 2011 నుంచి పోటీ పరీక్షలు రాస్తున్నా. 2012లో నాన్న చనిపోవడంతో కుటుంబ బాధ్యతలు మీదపడ్డాయి. అమ్మ ప్రోత్సాహంతో నాలుగు సార్లు పోలీసు, జేఎల్, గురుకుల ఉద్యోగాలకు ప్రయత్నించి స్వల్ప తేడాతో కోల్పోయా. మరింత పట్టుదలతో ఈ సారి డీఎస్సీ సాధించా. ఇన్నేళ్లు పడిన కష్టం బడిలో అడుగుపెట్టగానే మాయమైంది. విద్యార్థుల్ని చూడగానే వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే భావన కలిగింది. ఉద్యోగంతో బాధ్యత మరింత పెరిగింది. భవితరాలను తీర్చిదిద్దే అవకాశం దక్కింది.

పదేళ్ల కష్టం కరిగిపోయింది



★ సాయికిరణ్
☛ ప్రగతినగర్, నిజామాబాద్
➻ మధుమలాంచ, బోధన్
■ ఎస్జీటీ
● సమయం లేక పరిచయంతో ముగించా.
✤ మా తాత టీచర్ కావడంతో చిన్నప్పుడే పాఠశాల పరిసరాలు చూసి ఉపాధ్యాయుడిని కావాలని కలలు కన్నా. ప్రభుత్వ డైట్ కళాశాలలో 2014-16 డీఎడ్ చేశా. 2018 డీఎస్సీ 2 మార్కులతో కోల్పోయా. ప్రైవేటు పాఠశాలలో బోధన చేస్తూ ఈ సారి డీఎస్సీలో జిల్లాలో మూడో ర్యాంకు సాధించా. పాఠశాల వాతావరణం చాలా బాగుంది. విద్యార్థులు, పరిసరాలు చూశాక పదేళ్ల కష్టం మర్చిపోయా.



నాలుగో తరగతి విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ముకుంద్

అమ్మ పనిచేసిన చోటే పోస్టింగ్

★ భోజన్నగారి ముకుంద్
☛ బ్రహ్మపురి కాలనీ, నిజామాబాద్
➻ కోటగల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
■ ఎస్జీటీ ● క్రీడాకారుల పరిచయం/నాలుగో తరగతి
✤ మా అమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, నాన్న ప్రైవేటు ఉపాధ్యాయుడు. మా బంధువుల్లో చాలామంది ఇదే వృత్తిలో ఉండటంతో చిన్నప్పటి నుంచే బోధనపై ఆసక్తి పెరిగింది. 2015-17 ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎడ్ చేశాను. సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశా. యూపీఎస్సీ రెండు సార్లు రాసినా రాలేదు. తర్వాత గ్రూప్-1 రాసి ప్రిలిమ్స్‌లో అర్హత సాధించా. ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. అమ్మ పనిచేసిన చోటే ఉద్యోగం రావడం అదృష్టంగా భావిస్తున్నా.

అనుభవం..పట్టుదల

★ డి.ప్రవీణ్ కుమార్ ☛ ఆర్మూర్
➻ మిట్టపల్లి జడ్పీహెచ్ఎస్ ■ జీవశాస్త్రం, ఎస్ఏ
● పదార్థాలు వాటి ధర్మాలు/ఆరో తరగతి
✤ 20 ఏళ్ల బోధన అనుభవం, పట్టుదలతోనే ఉద్యోగం వరించింది. పీజీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఐఐటీ ఫ్యాకల్టీగా సేవలందించా. శిక్షణ కేంద్రాల్లో పనిచేసుకుంటునే స్నేహితుల సలహాతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యా. గురుకుల, కేంద్రీయ విద్యాలయ పోస్టులు స్వల్ప తేడాతో కోల్పోయాను. స్థానికంగా ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగమే మేలని పట్టుదలతో ఆర్నెల్లుగా సన్నద్ధమై కొలువు కొట్టాను. పాఠశాలలో తొలిరోజు విద్యార్థులు బాగా ఆప్యాయత చూపారు. వారితో మాట్లాడటం ఎంతో నచ్చింది.



తరగతి గదిలో ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్

పరిశుభ్రత పాటించకుంటే చర్యలు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌ను బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూరగాయలు, ఇతరత్రా వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించే గంజ్ పరిసరాలు అపరిశుభ్రతతో ఉంటే బాధ్యులపై చర్యలుంటాయని హెచ్చరించారు. చెత్తాచెదారం పారేసే వారిని సిబ్బంది ఒక కంట కనిపెట్టాలని ఆదేశించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మార్కెట్‌కు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని వ్యాపారులకు హామీ ఇచ్చారు. వాహనాల పార్కింగ్‌లో క్రమపద్ధతిని పాటించేలా చూడాలని పేర్కొన్నారు. యార్డుకు వచ్చే వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలోనే ఉత్తమ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.



అధికారులతో కలిసి గాంధీగంజ్ పరిసరాలు పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి





బుధవారం వేకువజామున 3 గంటలకు నియామకపత్రాలు అందజేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్ : అభ్యర్థుల నుంచి పత్రాలు తీసుకుంటున్న ఎంఈవో సాయరెడ్డి

462 మంది అభ్యర్థులకు బడుల కేటాయింపు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని పాఠశాల విద్యాశాఖలో బుధవారం ఎవరిని కదిలించినా.. ఆర్డర్లు.. రిపోర్టు.. రిలీవ్ అనే పదాలే వినిపించాయి. మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం వేకువజాము వరకు కొనసాగింది. మొత్తం 464 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారని, 462 మందికి ఎంచుకున్న పాఠశాలల్ని కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఆర్డర్లు తీసుకున్న నూతన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ కార్యాలయాలకు వెళ్లి రిపోర్టు చేశారు. చాలా ప్రాంతాల్లో రిపోర్టు ప్రక్రియ ఆలస్యం కావడంతో పలువురు పాఠశాల మూసివేత సమయానికి చేరుకున్నారు. కాగా గతంలో బదిలీ అయినప్పటికీ ఉపాధ్యాయుల కొరతతో అక్కడే పనిచేస్తున్న వారిని బుధవారం మధ్యాహ్నం నుంచి అధికారులు రిలీవ్ చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులు వచ్చిన అన్ని బడుల్లో రిలీవ్ చేయాలని డీఈవో ఆదేశించగా ఎంఈవోలు ప్రక్రియ పూర్తిచేశారు.



రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయెంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం చేసి నిరసన తెలిపారు. – న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

విమానం అందుకోలేక
యువకుడి మనస్తాపం

సౌదీకి వెళ్లే అవకాశం చేజారడంతో ఆత్మహత్య



కొండ్రు గణేశ్

బాల్కొండ, న్యూస్‌టుడే: విమానం అందుకోలేక గల్ఫ్ వెళ్లాల్సిన యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం బస్సాపూర్‌లో చోటుచేసుకుంది. ఏఎస్సై శంకర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ్రు గణేశ్(25) ఉపాధి నిమిత్తం సౌదీఅరేబియా వెళ్లేందుకు అప్పులు చేశారు. మంగళవారం బయలుదేరడానికి టిక్కెట్ సైతం బుక్ చేసుకున్నారు. బస్సాపూర్‌లో ఇంటి నుంచి హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి బయలుదేరారు. కానీ సరైన సమయానికి చేరుకోకపోవడంతో లోపలికి అనుమతి లభించలేదు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో నిరాశగా ఇంటికి వెనుదిరిగారు. తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ అప్పులు ఎలా తీర్చాలో తెలియక గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మొదట నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఇంకా సందిగ్ధతే..! | తగ్గని రద్దీ.. సీట్లకు పాట్లు | పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి | కారు బోల్తా.. కానిస్టేబుల్‌కు గాయాలు | 8లో...

మహిళల పెన్నిధి.. బ్యాంకు లింకేజీ

ఈ ఏడాది రుణ లక్ష్యం రూ.1,228 కోట్లు ● ఇప్పటి వరకు 60 శాతం పంపిణీ

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు ఏటా సెర్ప్ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తారు. అర్హులైన సభ్యులకు రూ. 50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఇస్తారు. ఈ రుణంతో చిన్నపాటి వ్యాపారం చేసి వచ్చే ఆదాయంతో ఆర్థిక స్థిరత్వం పొందాల్సి ఉంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 20,350 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.1,228.72 కోట్ల రుణ పంపిణీ లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 8,750 సంఘాలకు రూ.727.42 కోట్లు అందించి 59.20 శాతానికి చేరుకున్నారు.



సిబ్బందిపై పని ఒత్తిడి

జిల్లాకు రుణ లక్ష్యం ఏటేటా పెంచుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,032.72 కోట్ల రుణ లక్ష్యం ఉండగా ఈ సారి ఏకంగా రూ.200 కోట్లు పెంచింది. లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో కిందిస్థాయి సిబ్బంది ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోంది.

నవీపేట భేష్


జిల్లాలో 27 మండలాల్లో నవీపేట మండలం ప్రథమ స్థానంలో ఉంది. 1,109 సంఘాలకు రూ.67.32 కోట్ల లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 525 సంఘాలకు రూ.56.36 కోట్ల రుణం ఇచ్చి 83.72 శాతం సాధించారు. కోటగిరి మండలం 50.89 శాతంతో వెనుకంజలో ఉంది. 819 సంఘాలకు రూ.51.78 కోట్ల లక్ష్యం ఉండగా 226 సంఘాలకు రూ. 26.35 కోట్లు అందించారు. మార్చి వరకు గడువు ఉందని, శతశాతం లక్ష్యం సాధిస్తామని, ఇప్పటికే సిబ్బందితో పలుమార్లు సమావేశం నిర్వహించామని డీఆర్‌డీవో సాయాగౌడ్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

మండలాలు: 27 | స్వయం సహాయక సంఘాలు: 23,796 | సభ్యుల సంఖ్య: 2,54,865

బ్యాంకు లింకేజీ లక్ష్యం : రూ. 1,228.72 కోట్లు | ఇప్పటి వరకు ఇచ్చింది : రూ.727.42 కోట్లు

పల్లె దారులకు సీఆర్ఆర్ నిధులు

ఐదు నియోజకవర్గాలకు రూ.55 కోట్లు కేటాయింపు



న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, ఖలీల్‌వాడి



పల్లె దారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం సీఆర్ఆర్ (నియోజకవర్గ రూరల్ రోడ్లు) కింద జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు రూ.55 కోట్లు కేటాయించింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పనులు చేపట్టనున్నారు. ఏటా ఉపాధి హామీ కింద గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేవారు. ఇందులోనే రాష్ట్ర ప్రభుత్వం వాటా ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని నిర్ణయించింది.

నియోజకవర్గం	నిర్మించాల్సిన రోడ్లు (కి.మీ.)	నిధులు (రూ.కోట్లలో)
బోధన్	15.90	15
ని.గ్రామీణం	15.65	15
బాన్సువాడ	39.90	15
బాల్కొండ	4.80	5
ఆర్మూర్	4.90	5

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం

జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో బోధన్, నిజామాద్ గ్రామీణంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. బాన్సువాడ ఎమ్మెల్యే అధికార పార్టీలో చేరారు. ఈ మూడు చోట్ల రూ.15 కోట్ల చొప్పున కేటాయించారు. బాల్కొండ, ఆర్మూర్‌లకు రూ.5 కోట్ల చొప్పున ఇచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే పనులు ప్రతిపాదించారు. బోధన్ నియోజకవర్గంలోని రెంజల్, బోధన్, నవీపేట, ఎడపల్లి, నిజామాబాద్ గ్రామీణంలో ఇందల్‌వాయి, నిజామాబాద్, జక్రాన్‌పల్లి, సిరికొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, బాన్సువాడలో కోటగిరి, పోతంగల్, వర్ని, రుద్రూరు, మోస్రా, చందూరు, బాన్సువాడ, బీర్కూరు, నస్రుల్లాబాద్, బాల్కొండలో వేల్పూర్, మెండోరా, భీమ్‌గల్, ఆర్మూర్‌లో ఆర్మూర్, నందిపేట మండలాలకు నిధులు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు గుర్తించిన గ్రామాల్లో పనులు చేయనున్నారు.



నిజామాబాద్ ప్రధాన బస్టాండులో ప్రయాణికులు

తగ్గని రద్దీ.. సీట్లకు పాట్లు

దసరా పండగకు సొంత గ్రామాలకు వచ్చి తిరిగి ఉద్యోగాలు, చదువుల కోసం పట్టణాల బాట పట్టిన ప్రయాణికులతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతూనే ఉన్నాయి. రద్దీ పెరగడంతో సీట్ల కోసం బస్సుల్లో పోటీపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం సాయంత్రం నిజామాబాద్ బస్టాండ్‌లో కనిపించిన దృశ్యాలివి. – ఈనాడు, నిజామాబాద్



కిటికీల్లో నుంచి సీట్ల కోసం వస్తువులు వేస్తున్నారిలా..



కోతుల బెడద.. జనం దడ

రోడ్డు మీద కోతుల గుంపు సంచరిస్తుండడంతో భయంతో ప్రజలు ఇళ్లకే పరిమితమైన ఈ చిత్రం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలోనిది. ఈ చిత్రాన్ని న్యూస్‌టుడే బుధవారం క్లిక్‌మనిపించింది. జిల్లా కేంద్రంలోని మెజారిటీ కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంటోంది. రోజూ ఏదో చోట కోతుల దాడిలో ప్రజలు గాయపడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

గుంత చింత తీరేదెన్నడు?

కామారెడ్డి జిల్లాకేంద్రం రాంమందిర్‌కు వెళ్లే రోడ్డులోని గాంధీ గంజ్ ప్రాంతంలో ఏర్పడిన గుంత వాహనదారులు, ప్రజలకు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రోడ్డుపై వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రాజంపేట మండలం శివాయిపల్లికి చెందిన యువకుడి కారు టైర్ బుధవారం ఇలా గుంతలో ఇరుక్కుంది. స్థానికులు గమనించి ప్రమాదాన్ని నివారించగలిగారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం



ఇరుక్కున్న కారు



అంతరచిత్రంలో గుంత

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

కరీంనగర్, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో పద్మశాలీలు రాజకీయ బరిలో ఉండి, సత్తా చాటాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలీ ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళం ప్రకటించడాన్ని అభినందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రరావు, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మురళి

జాతీయస్థాయి కథల పోటీల్లో ప్రతిభ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మాదిరాజు బాలసాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల్లో విజయ్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బి.తనుశ్రీ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి బుధవారం తెలిపారు. విద్యార్థినితో పాటు ఆమె గైడ్‌టీచర్‌ని పాఠశాల కార్యదర్శి అమృతలత అభినందించారు. అన్ని రాష్ట్రాల నుంచి 250మంది విద్యార్థులు పాల్గొనగా.. 20 ఉత్తమ కథలు ఎంపిక చేశారని అందులో తనుశ్రీ రాసిన 'కష్టేఫలి' కథకు చోటుదక్కడం అభినందనీయమన్నారు. నవంబరు 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వెల్లడించారు.



విద్యార్థిని అభినందిస్తున్న విజయ్ పాఠశాల కార్యదర్శి అమృతలత

ఇంకా సందిగ్ధతే..!

● ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తారా.. నిల్వ చేస్తారా

● ఉమ్మడి జిల్లాలో గోదాములను పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

వానాకాలం సీజన్ ధాన్యం కేటాయింపులపై సందిగ్ధత నెలకొంది. ఈ ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తారా లేక గోదాముల్లో నిల్వ చేస్తారా అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నారు. సన్న ధాన్యం తీసుకుంటే తాము నష్టపోతామని, ఎట్టి పరిస్థితుల్లో సన్నరకాలను తీసుకోబోమని మిల్లర్లు కలెక్టర్లకు లేఖలు రాశారు. దాంతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లు పెట్టారు. అంతే సర్కార్ మాత్రం స్పందించినట్లు తెలుస్తోంది. ఈ వానాకాలం సీజన్ ధాన్యాన్ని మిల్లులకు కేటాయించవచ్చని తామే గోదాముల్లో నిల్వ చేస్తామని పేర్కొంది. ఇప్పటి వరకు మిల్లుల కేటాయింపులు పూర్తికాలేదు. ఒకవైపు ప్రైవేట్ వ్యాపారులు ధాన్యాన్ని కొంటున్నప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.

గోదాములు ఎన్ని ఉన్నాయి ?

వానాకాలం సీజన్‌లో కామారెడ్డి జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 5.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి ప్రణాళిక రూపొందించారు. ఇక నిజామాబాద్ జిల్లాలో 629 కొనుగోలు కేంద్రాల ద్వారా 8 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధమయ్యారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఉమ్మడి జిల్లాలో ఉన్న 490 రైసుమిల్లులకు కేటాయించేవారు. అవసరమైతే పక్క జిల్లాలకు కూడా పంపేవారు. అయితే ప్రస్తుతం మిల్లుల కేటాయింపులు పూర్తికాలేదు. ఈలోగా తామే గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు అందుబాటులో ఉన్న గోదాముల వివరాలు సేకరిస్తున్నారు.



మొత్తం గోదాముల్లో ఎంత ధాన్యం పడుతుందని లెక్కలు వేస్తున్నారు. సుమారు 13.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం గోదాముల్లో పట్టే అవకాశం లేదు. ఉమ్మడి జిల్లాలో అసలే గోదాముల కొరత వేధిస్తోంది. ఇప్పటికైతే గోదాముల వివరాలు ఆరా తీస్తున్నామని **కామారెడ్డి పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్** పేర్కొన్నారు.

తూకం అధికంగా వేయొద్దు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అధికంగా తూకం వేయొద్దని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను బుధవారం కలిసి రైతు పక్షాల డిమాండ్లను విన్నవించారు. జిల్లా వ్యాప్తంగా 40 కిలోల 650 గ్రాముల ధాన్యాన్ని మాత్రమే తూకం వేయాలని పేర్కొన్నారు. అంతకంటే ఎక్కువ తూకం వేయడం కుదరదన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సిటిజన్ బ్యాలెట్ ఫ్లెక్సీలను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబీర్ ఆనంద్‌రావు, రాష్ట్ర సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, జోనల్ అధ్యక్షుడు లంక వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, కార్యదర్శి శంకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రాయసం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన భారతీయ కిసాన్‌సంఘ్ ప్రతినిధులు

కళోత్సవ్ ప్రారంభం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని బాల్‌భవన్‌లో విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంవో) జీవన్ అధ్యక్షతన జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి 9, 10, 11, 12వ తరగతులకు సంబంధించిన విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా డీఈవో దుర్గాప్రసాద్ హాజరై పోటీలను తిలకించారు. మొదటి రోజు గాత్ర సంగీతంలో కర్ణాటక, హిందుస్థానీ, జానపద పాటల పోటీలు కాగా, వాద్యసంగీతంలో తబలా, డోలక్, డప్పు, వయోలిన్, గిటార్లతో ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. బాలభవన్ పర్యవేక్షణాధికారి ప్రభాకర్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాశాఖ ఏఎంవో జీవన్

బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ నుంచి ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. రెండేళ్లుగా ఉన్న బకాయిలు ఇవ్వాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఓమయ్య, రఘురాం, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి రాసిన లేఖను చూపుతున్న సీపీఐ నాయకులు

ఫుట్‌బాల్‌లో కాంస్య పతకాలు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ జాహ్నవి, జె.మధుశ్రీ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలికల విభాగంలో పాల్గొని కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. పాఠశాల కార్యదర్శి అమృతలత విద్యార్థుల్ని అభినందించారు.

బీడీ కార్మికుల ధర్నా

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కామారెడ్డి జిల్లాకేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో దేశాయి బీడీ సంస్థ ఎదుట బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ.. యాజమాన్య ప్రతినిధులు బీడీ కార్ఖానాల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కార్మికుల నుంచి 400 బీడీలు స్వీకరిస్తున్నారన్నారు. కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌గౌడ్, నర్సింలు, అరుణ్, శ్రీహరి, రాణి, భాగ్యమ్మ, రేణుక, లక్ష్మి, ప్రేమలత, జ్యోతి, సత్యం, రాజనర్సు, వాణి, మంజుల తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రమ



కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ అనస్థీషియా దినోత్సవం బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ఇండియన్ సొసైటీ అనస్థీషియా వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు సీఎంఈలో పాల్గొని పరిశోధనలు సీనియర్ వైద్యులకు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, అనస్థీషియా విభాగం అధిపతి మల్లారెడ్డి, వైద్యులు పి.సుధాకర్, రామకృష్ణ, చైతన్య, సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

19న ఈత ఎంపికలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు నగరంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్-14, 17 బాలబాలికలకు ఈత క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు పాఠశాల బోనాఫైడ్ వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. అండర్-14 బాలురు 2011 జనవరి 1, ఆ తర్వాత పుట్టినవారు, అండర్-17 బాలబాలికలు 2008 జనవరి 1, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. వివరాలకు 93472 16426 నంబరులో సంప్రదించాలన్నారు.

బ్యాడ్మింటన్‌లో..

నిజామాబాద్ క్రీడావిభాగం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్-14 బాలబాలికల బ్యాడ్మింటన్ ఎంపికలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. క్రీడాకారులు కిట్లు, షూతో రావాలని, బోనాఫైడ్ తెచ్చుకోవాలని సూచించారు. అండర్-14 బాలురు 2011 జనవరి 1, ఆ తర్వాత పుట్టినవారు అర్హులన్నారు.

నవోదయ విద్యాలయంలో ప్రవేశాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో తొమ్మిది, పదకొండు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి విద్యాశాఖ జిల్లా అధికారి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగంపై పట్టింపు కరవు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని తెవివి నూతన బాలుర వసతి గృహం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని పట్టించుకోవడం లేదని సంఘం జిల్లా కార్యదర్శి విఘ్నేష్ ఆరోపించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు దినేశ్, చక్రి, జీవన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సహాయ కేంద్రం ఏర్పాటు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయంలో నూతన ప్రవేశాలు పొందిన విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. దరఖాస్తు పూరించడం, ఇతర వివరాలు విద్యార్థులకు వివరించారు. ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సందేహాలు తీరుస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

రహదారిపైకి మొసలి

తాళ్లరాంపూర్(ఏర్గట్ల), న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లరాంపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి ప్రాంతంలో ఆరోగ్య ఉప కేంద్రానికి సమీపంలో రహదారిపైకి మొసలి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని కమ్మర్‌పల్లి అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. అధికారులు వచ్చేలోపు శివారులోని కాలువ ద్వారా వెళ్లిపోయి ఉండవచ్చని గ్రామస్థులు పేర్కొన్నారు.



అటవీ సెక్షన్ అధికారి మృతి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: బాన్సువాడ అటవీ రేంజ్ పరిధిలో పని చేస్తున్న నిజాంసాగర్ సెక్షన్ అధికారి (ఎఫ్ఎస్‌వో) గులాం దస్తగిరి(58) విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై చనిపోయారు. వివరాలిలా.. బుధవారం విధులకు వచ్చిన ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో బాన్సువాడ పట్టణంలోని ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈయన స్వస్థలం సిద్దిపేట జిల్లా ములుగు. రెండేళ్ల కిందట పదోన్నతిపై బాన్సువాడ రేంజ్‌కు వచ్చారు. కామారెడ్డి జిల్లా అటవీ అధికారి నిఖిత, ఇన్‌ఛార్జి డివిజన్ అధికారి రామకృష్ణ, రేంజ్ అధికారి హబీబ్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.



గులాం దస్తగిరి

కారు బోల్తా.. కానిస్టేబుల్‌కు గాయాలు

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి జాతీయ రహదారి వంతెన పై నుంచి బోల్తాపడిన ఘటన డిచ్‌పల్లి మండలం బీబీపూర్‌తండా సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో ఏఆర్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ బాల్‌సింగ్ ఇందల్‌వాయి మండలం పాటితండాకు వెళ్లి, సాయంత్రం నిజామాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి వంతెన పైనుంచి కిందకు పడింది. ప్రమాద సమయంలో కారు నాలుగు డోర్లు లాక్ అయ్యాయి. వెనకాల తలుపు తెరుచుకోవడంతో బాల్‌సింగ్ బయటకు వచ్చారు. అదే మార్గంలో వెళ్తున్న సీఐ మహేష్ ఘటన స్థలం వద్ద ఆగి హైవే పెట్రోలింగ్ పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బందికి సమాచారం అందించడంతో సత్వరమే స్పందించారు. ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. వెంటనే క్రేన్ తెప్పించి కారును బయటకు తీయించారు.



నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పీడీఎస్‌యూ భవన్ వద్ద బోధన్ వామపక్ష నాయకులు బుధవారం పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వరదయ్య, గంగాధరప్పా తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ ఆహార దినోత్సవం

నవీపేట(కోటగిరి) : కోటగిరిలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో బుధవారం 'ప్రపంచ ఆహార దినోత్సవం' నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, రంగోలి, వంటలు తయారు చేసే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా కామధేను ఫుడ్ ఇండస్ట్రీ అధిపతి బి.వెంకటేశ్ హాజరై మాట్లాడారు. కళాశాల డీన్ కల్పన తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలు రుచి చూస్తున్న అతిథులు

సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: విశ్వం: 10.30, 4.10, 10.35(రాత్రి)
జనక అయితే గనక: 1.30 దేవర పార్ట్-I: 7.25
స్క్రీన్-2: జిగ్రా (హిందీ) 10.30, 1.30, 10.20(రాత్రి)
మా నాన్న సూపర్ హీరో: 4.30 జనక అయితే గనక: 7.30
స్క్రీన్-3: వెట్టయాన్ 10.20, 1.35, 4.30, 7.30, 10.40(రాత్రి)
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వెనుమాల్)
స్క్రీన్-1: వెట్టయాన్: 12.05 దేవర పార్ట్-I: 3.35
ది వైల్డ్ రోబోట్ (హిందీ): 7.10, 9.40 (రాత్రి)
స్క్రీన్-2: జనక అయితే గనక: 10.10, 4.10
మా నాన్న సూపర్ హీరో: 1.10
విశ్వం: 7.15 10.30(రాత్రి)
స్క్రీన్-3: విక్కీ విద్యా కా వో వాలా (హిందీ): 10.05 మార్టిన్: 1.25
జనక అయితే గనక: 7.50
వెట్టయాన్: 4.20, 10.50(రాత్రి)
స్క్రీన్-4: జిగ్రా (తెలుగు): 9.25 విశ్వం: 12.55
జిగ్రా (హిందీ): 4.15 మార్టిన్: 7.35,
విక్కీ విద్యా కా వో వాలా (హిందీ) 7.20 (రాత్రి)
జనక అయితే గనక: 10.40 (రాత్రి)
దేవి (ఏసీ్పీ): మార్టిన్
11.15, 2.15, 6.15, 9.15(రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): విశ్వం
11.00, 2.20, 6.00, 9.20(రాత్రి)
లలితామహల్(ఏసీ్పీ): దేవర పార్ట్-I
10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఏసీ్పీ): వెట్టయాన్
11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఇక్కట్లకు స్వస్తి.. చెంతనే రక్తశుద్ధి

● డిచ్‌పల్లి సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన సేవలు

న్యూస్‌టుడే, డిచ్‌పల్లి

మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు వరంగా మారింది డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం లోని డయాలసిస్ కేంద్రం. ఉచిత వైద్యం అందడం.. దూరభారమూ తగ్గడంతో రోగులు డిచ్‌పల్లికి వరుస కడుతున్నారు. ఏడాది కిందట రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో సీహెచ్‌సీలోని ఓ గదిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయగా రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

పెరుగుతున్న కేసులు..

మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు రక్తశుద్ధి తప్పనిసరి. జీజీహెచ్, ఆర్మూర్ తదితర దవాఖానాల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. రోగుల సంఖ్య పెరగడంతో కేంద్రాలు సరిపడటం లేదు. నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గానికి కేంద్ర బిందువైన డిచ్‌పల్లిలో గతేడాది అక్టోబరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రతినెలా కనీసం 15 మంది రోగులు ఇక్కడ సేవలు పొందుతున్నారు. మందులు కూడా ఉచితంగా ఇస్తుండటంతో ఇక్కడికి వరుస కడుతున్నారు. ఇలా ఏడాదిలో 1506 సార్లు రోగులు ఇక్కడ చికిత్స పొందారు.

తప్పిన దూరభారం

గతంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల కిడ్నీ రోగులు డయాలసిస్‌కు నిజామాబాద్, ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రులకు వెళ్లేవారు. అక్కడ రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. డయాలసిస్‌తో పాటు ప్రయాణం, మందుల ఖర్చులతో ఇబ్బంది పడేవారు. పేద, మధ్య తరగతి రోగుల బాధ వర్ణనాతీతం. డిచ్‌పల్లిలోనే కేంద్రం అందుబాటులోకి రావడంతో రోగులకు దూరభారంతో పాటు ఆర్థికభారం తగ్గింది.



డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

సద్వినియోగం చేసుకోవాలి

- డా.సందీప్‌రెడ్డి, వైద్యాధికారి

సీహెచ్‌సీలో రాజీవ్ ఆరోగ్యశ్రీ డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఉచితంగా మందులు కూడా ఇస్తాం. సమీప మండలాలు, జిల్లా రోగులు సేవలు వినియోగించుకోవాలి.



ఇందూరు తిరుమలలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల దేవాస్థానాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. మోపాల్ మండల భాజపా కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేను సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు రవి, నాయకులు నవీన్‌రెడ్డి, లక్ష్మణ్, కిరణ్, సతీష్, నరేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి రాముడి చిత్రపటాన్ని అందిస్తున్న భాజపా నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన

సిరికొండ, న్యూస్‌టుడే: మండలంలోని వర్జిన్‌తండాలో పోలీసులు బుధవారం కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపాలని.. మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలని నృత్యాలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. ఎస్సై రాము, పోలీసు సిబ్బంది, కళాబృందం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

వర్ని, న్యూస్‌టుడే: వర్ని, చందూర్, మోస్రా మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బుధవారం ఆయా మండలాల రైతులు కోరుతున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా దళారులు ధాన్యం ధర తగ్గించడంతో పాటు బోనస్ ధర అందడంలేదని ఆరోపిస్తున్నారు.

'ఆరు గ్యారంటీల అమలేది?'

రుద్రూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో బుధవారం సీపీఎం మహాసభలో మాట్లాడారు. నాయకులు లక్ష్మణ్, నన్నే సాబ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు తదితరులు

సమస్యలు పరిష్కరించాలి

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: శివాజీ కంపెనీ బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. కార్మికులకు బీడీ చేయడానికి కావాల్సిన ముడి సరకును యాజమాన్యమే అందించాలన్నారు. వేతన చీటీలు ఇవ్వకపోవడంతో ఎంత వస్తుందో తెలియక అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరేందర్, ప్రతినిధులు రాజేశ్వర్, వెంకన్న, ముత్తన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: నగరంలోని వినాయక్‌నగర్ శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డుపై నాలాలు సరిగా లేక ఖాళీ స్థలంలో మురుగు నిలుస్తోంది. దుర్వాసనతో పాటు దోమల సమస్య తీవ్రమవుతుంది. **- ప్రవీణ్, స్థానికుడు**

సమాధానం: మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, నగరపాలక సంస్థ**

సమస్య: న్యాల్‌కల్ రోడ్డు సమీపంలోని చంద్రనగర్ కాలనీలో ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు నివాసాలుగా మారాయి. **- రామకృష్ణ, స్థానికుడు**

పరిష్కారం: పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- మహిపాల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: ఆదర్శనగర్ సమీపంలో ప్రధాన రోడ్డుపై మళ్లీ చెత్త వేస్తున్నారు. ఊడిపోయిన కంచెను చెత్త వేయకుండా సరిచేయాలి.
- కృష్ణ, స్థానికుడు

పరిష్కారం: ఊడిపోయిన కంచెను సరి చేసి చెత్త వేయకుండా చూస్తాం.
- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

– నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ నగరం

కలెక్టర్‌కు వినతి

నిజామాబాద్ కలెక్టరేట్, విద్యావిభాగం, న్యూస్‌టుడే: మాక్లూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారిణిని విధుల నుంచి తొలగించాలని ప్రగతి శీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నాయకులు కోరారు. బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం ఇచ్చారు. మరోసారి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు లలిత, అమూల్య, ముత్తెన్న, రాజేశ్వర్, వెంకన్న, మల్లేష్ ఉన్నారు.



బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ నగర ఏడీఈ-2గా ప్రసాద్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎస్‌ఈ కార్యాలయంలో కమర్షియల్ విభాగంలో పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడీఈగా పని చేసిన తోట రాజశేఖర్‌ను ఎస్‌ఈ కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ విభాగానికి కేటాయించారు. బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌రెడ్డి డీఈ శ్రీనివాస్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు.



ప్రసాద్‌రెడ్డిని అభినందిస్తున్న తోట రాజశేఖర్

మున్నూరుకాపులు ఐకమత్యంగా ఉండాలి

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని మున్నూరుకాపులు ఐకమత్యంగా ఉండి సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. ప్రగతినగర్‌లోని సంఘం కల్యాణ మండపంలో బుధవారం దసరా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కలిసి కట్టుగా ఉంటే ఏ పనైనా చేయొచ్చని తెలిపారు. తనవంతుగా సహకారం అందిస్తానని చెప్పారు. ప్రతినిధులు చిన్న రాజేశ్వర్, దారం సాయిలు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ మేయర్ సంజయ్



పూజా కార్యక్రమాల్ని తిలకిస్తున్న మహిళలు

వైభవంగా బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం ఆరాధన, నిత్య హవనము, వసంతోత్సవం, డోలోత్సవం, సాయంత్రం నిత్యహవనము, హారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు.

అయ్యప్పస్వామికి అభిషేకం

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఇందూరు అయ్యప్ప ఆలయంలో బుధవారం గణపతి హోమం, స్వామివారికి నవవిధ అభిషేకం, అర్చనలు, మహా హారతులు సమర్పించారు.

నేడు శరత్ పౌర్ణమి పూజలు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో విశేషంగా పూజలు చేయనున్నారు. కోజాగిరి పూర్ణిమగా కూడా పిలుస్తారు. పాలతో చేసిన తీపి వంటకాన్ని ఆత్మీయంగా ఆరగిస్తారు. ఇందూరు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో కస్బాగల్లీలోని వైదిక సత్సంగభవన్‌లో హోమం, వివిధ రకాల ఔషధాలు, పాలతో తయారుచేసే పాయస వితరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధ్యక్షుడు సూర్యప్రకాశ్ తెలిపారు.

18న శ్రీచక్రార్చనలు

నిజామాబాద్ సాంస్కృతికం: నగరంలోని దేవీమాత ఆలయాల్లో ఆశ్వయుజ మాసం సందర్భంగా ఈ నెల 18న శ్రీచక్రార్చనలు పంచామృతాభిషేకాలు చేయనున్నారు.

ఎమ్మెల్యే చొరవతో నిధులు

జక్రాన్‌పల్లి : ఆర్మూర్ మండలం అంకాపూర్ నుంచి జక్రాన్‌పల్లిలోని మునిపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు భాజపా నాయకులు పేర్కొన్నారు. గుత్ప అదనపు ఎత్తిపోతల పథకం సాధన కమిటీ అధ్యక్షుడు, భాజపా సీనియర్ నాయకుడు వకీల్ గంగారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు కిషన్ నాయక్ బుధవారం జక్రాన్‌పల్లిలో విలేకరులతో మట్లాడారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చొరవ తీసుకొని మంత్రి సీతక్క ద్వారా నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు.



సమావేశమైన భాజపా నాయకులు

లైన్‌మెన్‌కు సన్మానం

జక్రాన్‌పల్లి : అర్గుల్ గ్రామ ట్రాన్స్‌కో లైన్‌మెన్ సంతోష్ బదిలీపై వెళుతుండటంతో ఆయన గత నాలుగు సంవత్సరాలుగా గ్రామానికి అందించిన సేవలకు గుర్తింపుగా వీడీసీ సభ్యులు బుధవారం సన్మానించారు. వీడీసీ ఛైర్మన్ జైడి మధు, కోశాధికారి భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

అర్హులకు రుణమాఫీ చేయాలి

నవీపేట, న్యూస్‌టుడే: అర్హులందరికీ రుణమాఫీ చేయాలని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్‌సింగ్ తహసీల్దార్ వెంకటరమణకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఏఐకేఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, స్రవంతి, శంకర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ వితరణ

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: యానంపల్లి ఉన్నత పాఠశాలకు గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోహన్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 25 వేల విలువైన కంప్యూటర్, డెస్క్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌ను సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సభ విజయవంతానికి పిలుపు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే అర్ధశతాబ్ద సభకు విద్యార్థులు, మేధావులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఎన్‌ఆర్ భవన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని న్యూఅంబేద్కర్ భవనంలో కార్యక్రమం ఉంటుందన్నారు. నాయకులు ప్రిన్స్, మనోజ్, రాహుల్, రాజు తదితరులు ఉన్నారు.

కులగణన ఉత్తర్వులపై హర్షం

ఖలీల్‌వాడి: కులగణన చేపట్టాలని ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడంపై జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం అంబేద్కర్, జ్యోతిబా పులే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, రవీందర్, బసవరాజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అసద్‌బాబానగర్ శ్మశాన వాటికలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల కిందట భిక్షాటన చేస్తూ జీవిస్తున్న వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు ఎవరూ లేకపోవడంతో మా సంస్థ, జమాతే ఇస్లామీ, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ వారి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించామని ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు సాయిబాబు తెలిపారు.

జీజీహెచ్ నుంచి రోగి అదృశ్యం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ఒకటో ఠాణా పరిధిలోని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌కు చెందిన సుంకరి భూమన్న(54) అనారోగ్యంతో ఈనెల 14న జీజీహెచ్‌లో చేరారు. 15న ఉదయం మూత్రశాలకు వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లి ఎంతసేపైనా తిరిగి రాలేదు. ఆమె ఆసుపత్రి అంతా వెతికింది. . బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. ఆయన కుమారుడు సంపత్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడోరోజు నిరసనలు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు జిల్లావ్యాప్తంగా చేపట్టిన బంద్ మూడోరోజుకి చేరింది. అనంతరం జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణను కలిసి తమ నిరసనకు మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమ సమన్వయకర్త నరాల సుధాకర్, సుజన్, బాలకృష్ణ, శ్రీనివాస్, దత్తు, సందేష్ పాల్గొన్నారు.



మందకృష్ణ మాదిగకు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బోధన్‌లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యావేత్తలతో కలిసి మానవహారం చేపట్టారు. నాయకులు సూర్యప్రకాష్, రవిపటేల్ తదితరులు ఉన్నారు. పెండింగ్ ఉపకార వేతనాలను సర్కారు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



బోధన్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న ప్రతినిధులు

నేలకొరిగిన పంట.. కర్షకుల తంటా



ఎడపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షానికి బోధన్ నియోజకవర్గంలో వందలాది ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. సాధారణంగా పంట బాగుంటే యంత్రంతో నూర్పిడి చేసేందుకు సుమారు గంట నుంచి 1:15 నిమిషాల సమయం పడుతుంది. ఇందుకు రూ. 2500 ఖర్చు చేస్తారు. నేలకొరిగిన పంటను కోసేందుకు 1:45గంటల వరకు సమయం పట్టడంతో రైతులకు అదనంగా మరో రూ. వెయ్యి భారం పడుతుంది.

రేషన్ బియ్యం పట్టివేత

వాడి(ధర్పల్లి), న్యూస్‌టుడే: వాడి శివారులో అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని జప్తు చేసినట్లు ఏఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. పౌరసరఫరాల పంపిణీ అధికారి రవిరాథోడ్ ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిజాంసాగర్ కాల్వలో పడి మృతి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి నిజాంసాగర్ కాల్వలో పడి మృతి చెందిన ఘటన కొత్తాపేట్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దొల్ల లింగం(54) బుధవారం గ్రామ శివారులోని కాల్వ సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడ్డారు. గమనించిన స్థానికులు లింగంను బయటకు తీసినా అప్పటికే మృతి చెందారు. రూరల్ ఠాణా పోలీసులను వివరణ కోరగా.. ఘటనా స్థలికి వెళ్లి వివరాలు సేకరించామని, ఫిర్యాదు అందలేదన్నారు.

పులాంగ్ వాగులో వృద్ధురాలు

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గూపన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ద రాజవ్వ(85) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బుధవారం గూపన్‌పల్లి పులాంగ్ వాగులో ఆమె మృతదేహం కనిపించినట్లు ఠాణా ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరీఫ్ తెలిపారు. ప్రమాదవశాత్తు పడి చనిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాజవ్వ

జూదస్థావరంపై దాడి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మోపాల్ మండలం న్యాల్కల్ శివారులో జూదం ఆడుతున్న నలుగురుని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 6730 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి చెందిన జావిద్‌అహ్మద్ బుధవారం తన ద్విచక్రవాహనంపై నడక కోసం డీఎస్‌ఏ మైదానానికి వచ్చారు. వాహనం మైదానం బయట నిలిపి లోపలికి వెళ్లారు. నడక పూర్తయిన తర్వాత బయటకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. చోరీకి గురైందని గుర్తించి ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా, చోదకుడికి గాయాలు

వర్ని, న్యూస్‌టుడే: ధాన్యం లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. వివరాలిలా.. చందూర్ మండల కేంద్రం నుంచి ధాన్యం లోడుతో వర్ని వైపు వెళ్తున్న లారీ గ్రామ శివారు ప్రధాన రహదారి పై టైరు పగిలి అదుపుతప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ దినేష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానాకు తరలించారు. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని విచారణ జరిపారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

గొలుసు చోరీ..

నిజామాబాద్ నేరవిభాగం: మూడో ఠాణా పరిధిలో గొలుసు చోరీ కేసు నమోదైనట్లు ఎస్సై నర్సయ్య తెలిపారు. ఎన్‌జీవో కాలనీకి చెందిన దివ్యాంగుడు సిద్ధిరాములు ఇంట్లో ఉండగా.. గమనించిన దుండగుడు బుధవారం ఇంట్లోకి వెళ్లి అతడి మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్మూర్
• ఆర్మూర్ • బాల్కొండ

సీఎంకు పోస్టు కార్డులు



బాల్కొండ, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నందుకు బాల్కొండలోని కాంగ్రెస్ శ్రేణులు బుధవారం సంబురాలు జరుపుకొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ పోస్టుకార్డులు పంపించారు. బాల్కొండ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, కుందారపు శ్రీనివాస్, ఇమ్రాన్, యూనుస్, గడ్డం రవి, గోపు ఊషన్న, నాగాపూర్ శ్రీనివాస్, కిషన్‌గౌడ్, విద్యాసాగర్, దివాన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు సినిమాలు
పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 **జిగ్రా:** 11.30, 5.40
మా నాన్న సూపర్ హీరో: 2.50 **మార్టిన్:** 9.00
స్క్రీన్-2 **దేవర:**11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 **వెట్టయాన్ ది హంటర్:** 11.50, 3.20, 6.50, 10.20
స్క్రీన్-4 **విశ్వం:** 10.00, 4.15, 10.30
జనక అయితే గనక: 1.15. 7.30

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..
94939 26837
98666 11160

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంజీ రోడ్డులో అనధికారంగా రెండు స్పీడు బ్రేకర్లు నిర్మించారు. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.
- విశ్వనాథ్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపిస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- రాజు, బల్దియా కమిషనర్, ఆర్మూర్

వీధి దీపాల ఏర్పాటు



నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్ పాతూర్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించారు. కాలనీలో పర్యటించి లైట్లు వెలగని చోట కొత్తవి ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్‌లో మగ్గిడి



సాధించిన కప్‌తో మగ్గిడి బాలికల జట్టు క్రీడాకారులు, పీడీ మధుసూదన్

– న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. వాలీబాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు కొల్లగొడుతున్నారు.. క్రీడా అకాడమీలకు ఎంపికవుతున్నారు.. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.. ఆర్మూర్ మండలం మగ్గిడి ఉన్నత పాఠశాల క్రీడాకారులు.

సత్తా చాటుతున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు

వ్యాయామ ఉపాధ్యాయుడి కృషి..

విద్యార్థులు వాలీబాల్ క్రీడలో రాణించడం వెనక వ్యాయామ ఉపాధ్యాయుడు మధుసూదన్ కృషి ఉంది. గత ఆరేళ్లుగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఆయన విద్యార్థులకు పాఠశాల వేళల్లోనే కాకుండా నిత్యం ఉదయం, సాయంత్రం శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతి వేసవిలోనూ గ్రామంలో ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి తర్ఫీదు ఇస్తున్నారు.

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా



- పల్లపు సాయిచరణ్, 10వ తరగతి

గతేడాది జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యా. ఒడిశాలో జరిగిన పోటీల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో ఉన్నత చదువులు పూర్తి చేసి క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా.

క్రీడాకారులు అందుకున్న విజయాలు..

- 9 మంది జాతీయస్థాయిలో, 16 మంది రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటారు.
- క్రీడాకారిణి నిషిత వైజాగ్ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికైంది.
- జిల్లాలో జరిగిన మండలస్థాయి అండర్ పాఠశాలల క్రీడల్లో 8 విభాగాల్లో విజేతలుగా నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందారు.

రాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించా



- కంఠ హిమతేజ, 10వ తరగతి (మగ్గిడి)

వాలీబాల్ చిన్నప్పటి నుంచి ఆసక్తి. బడిలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నా. గతేడాది జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాను. ఒడిశాలో జరిగిన పోటీల్లో తెలంగాణ జట్టుకు సారథిగా వ్యవహరించా. భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణిస్తా.

అందరూ సహకరిస్తున్నారు



- మధుసూదన్, పీడీ (మగ్గిడి)

విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంగా పని చేస్తున్నా. పాఠశాల సమయంతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా. ప్రధానోపాధ్యాయురాలు హరిత, గ్రామస్థుల సహకారం బాగుంది. క్రీడా దుస్తులు అందించి ప్రోత్సహిస్తున్నారు.

కొత్త గురువులొచ్చారు



కమ్మర్‌పల్లిలో ఉపాధ్యాయులతో ఎంఈవో ఆంధ్రయ్య

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి మండలంలో 20 మంది కొత్త ఉపాధ్యాయులు బుధవారం చేరినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. ఎస్ఏ-4, ఎల్పీ తెలుగు- 1, ఎస్‌జీటీ తెలుగు- 14, ఉర్దూ -1 కలిపి మొత్తం 20 మంది ఉన్నారని చెప్పారు. వీరిలో ఏడుగురు కోనసముందర్, చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి పాఠశాలల్లో చేరినట్లు పేర్కొన్నారు.

బాల్కొండ: ఎర్రోజుల విజయకృష్ణ బుధవారం మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్‌కు



బాల్కొండలో..

తన నియామక పత్రాన్ని అందజేసి విధుల్లో చేరారు. చిట్టాపూర్ ప్రేమ్‌నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు.

భీమ్‌గల్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు మండల విద్యాధికారి డి.స్వామి తెలిపారు. 31 మంది ఎస్‌జీటీలు, 12 మంది ఎస్ఏలు ఉన్నట్లు వివరించారు. వారికి పీఆర్‌టీయూ సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు ఎడ్ల శేఖర్, ప్రధాన కార్యదర్శి కర్నాల శ్రీనివాస్, రాస దయాకర్, కాశీరాం, ప్రభాకర్, వాసుదేవ్, వినోద్‌కుమార్, సుధాకర్, మురళీధర్, రవీందర్: వీఎల్ఎన్, రాధిక, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల, న్యూస్‌టుడే: డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు మండలంలోని వివిధ పాఠ



ఏర్గట్లలో...

శాలలను కేటాయిస్తూ నియామక పత్రాలు మండల విద్యాధికారి ఆనంద్‌రావు బుధవారం మండల కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 17న సబ్ జూనియర్ జిల్లా సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.

కార్మికులకు శిక్షణ

భీమ్‌గల్: భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఐటీఐ కళాశాలల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు సహాయ కార్మికశాఖ అధికారి సీహెచ్.ప్రభుదాస్ తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పొందాలని సూచించారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

వేల్పూర్, న్యూస్‌టుడే: వేల్పూర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఘనంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో యజ్ఞం, హోమం నిర్వహించారు. డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణసంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన అన్నాచెల్లెళ్లు

బషీరాబాద్(కమ్మర్‌పల్లి): బషీరాబాద్‌లో బక్కూరి పోత లింగన్న, గంగముత్తు దంపతుల పిల్లలు కృష్ణమూర్తి, మౌనిక అన్నాచెల్లెళ్లు. వీరు 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. గ్రామ యువత ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. తమ్మన్న, లింగన్న, శ్రీను, రవి, మురళి, బక్కన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్‌లో సన్మానిస్తున్న గ్రామస్థులు

పాకురు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ పోచమ్మవీధిలోని నీటి ట్యాంకు చుట్టూ పాకురు పేరుకుపోయింది. ఈ విషయమై 'ఈనాడు'లో ఈనెల 16న 'పాకురు.. తొలగిస్తే మేలు' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. పాకురును సిబ్బందితో తొలగింపజేశారు. స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కేంద్రం తెరిచారు... కొనుగోలు మరిచారు

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లిలో ప్రభుత్వ సోయాబీన్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. వారం రోజులవుతున్నా ఇంత వరకు కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించలేదు. నిరీక్షించే ఓపిక లేక రైతులు మళ్లీ ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఈనెల 10న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ గంగారెడ్డి, కేంఎసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య కేంద్రాన్ని ప్రారంభించారు. 11వతేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని చెప్పినా ఇంతవరకు మొదలవులేదు. రైతులు మద్దతు ధర రూ 4892 ఉన్నప్పటికి, గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు రూ 2400 విక్రయిస్తున్నారు. క్వింటాలుకు రూ 492 నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంపై ఆశతో కొమ్ముల హన్మంత్తు అనే రైతు ఇరవై రోజులుగా ఇంటి వద్దే సోయాబీన్‌ను నిల్వ చేశాడు. కొనుగోలుపై స్పష్ట త రాకపోవడంతో మబ్బుల వాతావరణానికి భయపడి ప్రైవేటు వ్యాపారికి విక్రయించాడు. క్వింటాకు రూ. 492 చొప్పున 30 క్వింటాళ్లకు రూ 14,760 నష్టపోయానని వాపోయాడు.



కమ్మర్‌పల్లి సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కళాశాల తీరుపై విద్యార్థుల నిరసన

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లోని ఓ కళాశాల విద్యార్థులు బుధవారం నిరసనకు దిగారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న తమను పూర్తి ట్యూషన్ ఫీజు కట్టలేదనే కారణంతో ఇంటర్నల్ పరీక్షలకు అనుమతించలేదని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ద్వారా తమకు ఫీజు రీయెంబర్స్‌మెంట్ ఉంటుందని చెప్పినా వినకుండా పరీక్షలు రాయనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆక్షేపించారు. నష్టపోతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ గజానన్‌కు వచ్చి వినతి పత్రం ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

కళ్లెదుటే అక్రమం.. చర్యలు శూన్యం

☛ మొరం వ్యాపారులకు ప్రజాప్రతినిధుల అండ

న్యూస్‌టుడే, భీమ్‌గల్

ప్రజాప్రతినిధుల అండదండలతో మొరం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. తాజాగా భీమ్‌గల్ పట్టణం కుప్కల్ రోడ్డులోని కస్తూర్బా పాఠశాల ఆవరణలో మొరం తవ్వకాలు జరిపారు. వందలాది ట్రిప్పుల మొరాన్ని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ విషయమై 'ఈనాడు'లో ఈనెల 16న 'బరితెగించారు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినా అధికారులెవరూ స్పందించలేదు. కళ్ల ఎదుటే అక్రమం జరిగినా చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. కనీసం అటువైపు వెళ్లి చూడటానికి కూడా ఇష్టపడటం లేదు. ఇందుకు కారణం అక్రమార్కులకు ప్రజాప్రతినిధులతో పరిచయాలు ఉండటమే. 'మొరం అక్రమ రవాణా విషయం అందరికీ తెలిసిపోయింది. కొన్ని రోజుల వరకు దందా మానుకోండి.. తర్వాత మళ్లీ కొనసాగించుకోవచ్చు. అప్పటి వరకు మేం చూసుకుంటాం' అని మాఫియాకు కొందరు ప్రజాప్రతినిధులే చెబుతున్నట్లు తెలిసింది.



ఇలా తవ్వి వదిలి వెళ్లారు..

గోతులమయం

కస్తూర్బా పాఠశాల ముందు భాగంలో రెండు మీటర్ల లోతు తవ్వారు. మొరాన్ని తరలించారు. సాయంత్రం అలాగే వదిలేశారు. ఆవరణ గోతులమయంగా మారింది. ఒకవేళ వర్షం వస్తే పక్కనే ఉన్న గుట్టల నుంచి వచ్చిన వరద నీరు పాఠశాల ఆవరణలో నిండి విద్యార్థులకు ఇబ్బందులు కలుగే అవకాశం ఉంది.

కప్పల వాగు నుంచి..

అక్రమార్కులు కొండలు, గుట్టలు కొల్లగొడుతున్నారు. పట్టణ శివారుల్లోని గుట్టలన్నీ ఆనవాళ్లు కోల్పోయాయి. చెరువులు క్వారీలను తలపించే విధంగా కొల్లగొట్టారు. ప్రస్తుతం అవి సరిపోవన్నట్లుగా తహసీల్దార్ కార్యాలయం వెనుకనే ఉన్న కప్పలవాగుపై పడింది వారి కన్ను. వాగులో నుంచి సైతం మొరం తీయడం ప్రారంభించారు.

నైపుణ్యంతోనే వృత్తికి న్యాయం



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

ఆర్మూర్, న్యూస్‌టుడే: చేసే వృత్తిపట్ల నిబద్ధతతో, పూర్తి స్థాయి నైపుణ్యంతో ఉంటేనే న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ సహాయ సంక్షేమ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. ఆర్మూర్ విశాఖ కాలనీలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో తాటి చెట్లు ఎక్కే గీత కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ గ్రామీణం, అర్బన్ నియోజకవర్గాలకు చెందిన కార్మికులు హాజరయ్యారు. వీరికి కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందజేశారు. ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీఫెన్, మోర్తాడ్ సీఐ గుండప్ప, భీమ్‌గల్ సీఐ వేణుమాధవరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేశ్, సహాయ అధికారి శ్రీనివాస్ చారి, నర్సయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు మొదలుపెట్టండి



మాట్లాడుతున్న లింగారెడ్డి, చిత్రంలో రైతులు

ఆర్మూర్, న్యూస్‌టుడే: వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్న ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు తెరవలేదని ఆర్మూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ ఇట్టెడి లింగారెడ్డి విమర్శించారు. బుధవారం ఆలూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇచ్చి కొంటామన్నవారు, ఇప్పుడు కేవలం సన్నాలకే అంటున్నారని, అది కూడా కొనే దిక్కు లేదని ఏద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంట రైతులు ఎర్రన్న, నర్సయ్య, భూమారెడ్డి, ఏ. శ్రీను, చిన్నయ్య పాల్గొన్నారు.

బోరు మంజూరు

బట్టాపూర్(ఏర్గట్ల): బట్టాపూర్ గ్రామంలోని ఖబరిస్థాన్‌లో కొంతకాలంగా నీటి ఎద్దడి ఉందని మైనార్టీ సంఘ సభ్యులు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం బోరువేయించారు పెద్ద కరీం, చిన్న కరీం, ఖాసిం, బాలే శ్రీనివాస్, మల్లేశ్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

గోడ ప్రతుల ఆవిష్కరణ



కిసాన్‌నగర్(బాల్కొండ): టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ముత్తెన్న తెలిపారు. విలీన సభకు సంబంధించిన గోడ ప్రతులు కిసాన్‌నగర్‌లో సీజెడ్ కంపెనీలో బుధవారం ఆవిష్కరించారు. మనోజ్‌కుమార్, దేవదాస్, రాజేశ్వర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు మొదటి దశలో గత ఏడాది పంపిణీ చేయగా మిగిలిపోయిన ఇళ్లను అర్హులైన పేదలకు రెండో విడతలో పంపిణీ చేయడానికి నిర్ణయించినట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్తు శాఖ ఏఈగా బాధ్యతల స్వీకరణ

బాల్కొండ, న్యూస్‌టుడే: ట్రాన్స్‌కో బాల్కొండ ఏఈగా కిషన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా నిజామాబాద్ నుంచి వచ్చారు. ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. లైన్‌మెన్ సతీష్ మెండోరా మండల బుస్సాపూర్‌కు, కమ్మర్‌పల్లి నుంచి మల్లేష్ బాల్కొండకు వచ్చారు. ఆర్మూర్ నుంచి అసిస్టెంట్ లైన్‌మెన్‌గా గణపతి, ఇక్కడి నుంచి నాగరాజు సిరికొండ మండలానికి వెళ్లారు.

రాజరాజేశ్వరస్వామి జాతర ప్రారంభం

నందిపేట్, న్యూస్‌టుడే: నూత్‌పల్లి గ్రామంలో బుధవారం రాజరాజేశ్వరస్వామి జాతర ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మొదటి రోజు గ్రామంలో స్వామి వారి ఊరేగింపు, కల్యాణం నిర్వహించారు. గురువారం బోనాలు సమర్పిస్తారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బాల్కొండ, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కిషన్ తెలిపారు. పోచంపాడ్ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 నుంచి 10.30 గంటల సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పశువులకు టీకాలు

బాల్కొండ: బాల్కొండలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 240 గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్ తెలిపారు. సిబ్బంది ప్రణీత్, రాజు, మల్లేష్, బషీర్ పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: కౌల్‌పూర్ గ్రామ శివారులో జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కౌల్‌పూర్‌కు చెందిన రమేశ్ (40) ద్విచక్రవాహనంపై ఆంధ్రనగర్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. 108 సిబ్బంది ఈఎంటీ వినయ్, పైలట్ రమేశ్‌లు బాధితుడిని చికిత్స కోసం నందిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

జీజీహెచ్ నుంచి రోగి అదృశ్యం

నిజామాబాద్ నేరవిభాగం: ఒకటో ఠాణా పరిధిలోని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌హెచ్‌వో రఘుపతి కథనం ప్రకారం.. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి చెందిన సుంకరి భూమన్న(54) అనారోగ్యంతో ఈనెల 14న జీజీహెచ్‌లో చేరారు. 15న ఉదయం మూత్రశాలకు వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లి ఎంతసేపైనా తిరిగి రాలేదు. ఆమె ఆసుపత్రి అంతా వెతికింది.. బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. ఆయన కుమారుడు సంపత్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లోని మామిడిపల్లి రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. సుమారు 30 సంవత్సరాల వరకు వయస్సు ఉంటుందని, గూడ్సు రైలు ఢీకొని మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మృతుడి వివరాలు తెలిస్తే రైల్వే ఎస్సై సాయి రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ హన్మాండ్లును సంప్రదించాలని సూచించారు.